# ప్రపంచ బిలియర్డ్స్ చాంప్ పంకజ్

**రికార్డుస్థాయిలో 28వ సారి టైటిల్ కైవసం**



న్యూఢిల్లీ: భారత దిగ్గజ క్యూయిస్టు పంకజ్ అద్వానీ తనకు సాటి మరెవరు లేరని నిరూపించాడు. రికార్డు స్థాయిలో 28వ సారి ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌గా నిలిచి కొత్త చరిత్ర లిఖించాడు. శనివారం దోహా వేదికగా ముగిసిన ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో పంకజ్ 4-2తో రాబర్ట్ హాల్(ఇంగ్లండ్)పై చిరస్మరణీయ విజయం సాధించాడు. 2016 నుంచి వరుసగా ప్రపంచ టైటిళ్లు కొల్లగొడుతున్న పంకజ్‌కు ఇది వరుసగా ఏడో వరల్డ్ టైటిల్ కావడం విశేషం. ఆసక్తికరంగా సాగిన తుదిపోరులో హాల్ తొలి గేమ్‌ను కైవసం చేసుకోగా, ఆ తర్వాత పంకజ్ అద్భుతంగా పుంజుకున్నాడు. రెండు, మూడు గెలిచి జోరు మీదున్న అద్వానీకి హాల్.. నాలుగు, ఐదు గేముల్లో చెక్ పెట్టాడు. దీంతో పోరు ఆసక్తికరంగా మారింది. చివరి గేమ్‌లో గెలిచిన పంకజ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు.



# ఫైనల్లో పాలమూరు

**రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ**

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 9: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంగా రాష్ట్ర స్థాయి అండర్-19 బాలబాలికల బాస్కెట్ బాల్ టోర్నీ హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం బాలికల విభాగం సెమీస్‌లో మహబూబ్‌నగర్ 28-26తో ఖమ్మంపై గెలువగా, మరో సెమీస్‌లో హైదరాబాద్ 34-10తో రంగారెడ్డిపై గెలిచి ఫైనల్లోకి ప్రవేశించాయి. బాలుర కేటగిరీ సెమీస్‌లో హైదరాబాద్ 26-20తో కరీంనగర్‌పై, రంగారెడ్డి 33-11తో వరంగల్‌పై గెలిచి తుది పోరుకు అర్హత సాధించాయి. అంతకుముందు జరిగిన బాలుర విభాగంలో నల్లగొండపై 02-26 తేడాతో కరీంనగర్, మహబూబ్‌నగర్‌పై 06-28 తేడాతో హైదరాబాద్, నల్లగొండపై 00-27 తేడాతో రంగారెడి గెలుపొందాయి. కార్యక్రమంలో నిర్వాహకులు గోవర్ధన్‌రెడ్డి, ముకురం, సాధిక్, అరుణజ్యోతి పాల్గొన్నారు.

## హైదరాబాద్, రాజస్థాన్ పోరు డ్రా

జైపూర్: హైదరాబాద్, రాజస్థాన్ మధ్య రంజీ గ్రూపు-బీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. శనివారం ఓవర్‌నైట్ స్కోరు 36/0 నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన హైదరాబాద్ 3 వికెట్లు కోల్పోయి 273 పరుగులు చేసింది. కొడిమెల హిమతేజ(101 నాటౌట్) అజేయ సెంచరీతో విజృంభించగా, ఓపెనర్ తన్మయ్ అగర్వాల్(79) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. అయితే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కారణంగా రాజస్థాన్‌కు 3 పాయింట్లు దక్కగా, హైదరాబాద్ ఒక పాయింట్‌కు పరిమితమైంది. ఇప్పటి వరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒకటి గెలిచిన హైదరాబాద్(8) ఆరో స్థానంలో కొనసాగుతున్నది.

## టైటాన్స్ అదుర్స్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో టైటాన్స్ 34-33తో పుణెరి పల్టాన్‌పై అద్భుత విజయం సాధించింది. టైటాన్స్ తరఫున విజయ్ 13 పాయింట్లతో అదరగొట్టగా, స్టార్ రైడర్ పవన్ సెహ్రావత్(12) మరోసారి దుమ్మురేపా డు.

# జోరు సాగనీ

- నేడు భారత్, దక్షిణాఫ్రికా రెండో టీ20
- దూకుడుమీదున్న టీమ్‌ఇండియా
- పరువు కోసం సఫారీల ఆరాటం

**రా7.30 స్పోర్ట్స్-18లో**



**పొట్టి ఫార్మాట్‌లో భారత్ వరుస విజయాల ప్రస్థానం దిగ్విజయంగా కొనసాగుతున్నది. ప్రత్యర్థి ఎవరైనా సిరీస్ విజయం తమదే అన్న రీతిలో సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో టీమ్‌ఇండియా దూసుకెళుతున్నది. కుర్రాళ్లతో కళకళలాడుతున్న భారత్..సఫారీలపై అదే గెలుపు జోరు కొనసాగించేందుకు సిద్ధమైంది. శాంసన్ ధనాధన్ సెంచరీకి తోడు స్పిన్నర్ల విజృంభణతో తొలి టీ20లో ఘన విజయం సాధించిన టీమ్‌ఇండియా..ఆదివారం పోరులోనూ అదే రీతిలో సత్తాచాటాలని చూస్తున్నది. మరోవైపు ప్రపంచకప్ ఫైనల్లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్న సఫారీలు సొంతగడ్డపై తేలిపోతున్నారు. కనీసం పరువైనా నిలుపుకోవాలనుకుంటున్న దక్షిణాఫ్రికా..భారత్‌కు పోటీనివ్వాలని చూస్తున్నది.**

**నెబెహా:** నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఆదివారం రెండో టీ20 పోరు జరుగనుంది. డర్బన్‌లో భారీ విజయంతో బోణీ కొట్టిన టీమ్‌ఇండియా అదే ఊపులో సిరీస్‌లో మరింత ముందంజ వేయాలని చూస్తున్నది. నెబెహా(పోర్ట్ ఎలిజబెత్)లో జరిగే మ్యాచ్‌లోనూ విజయం సాధించేందుకు తహతహలాడుతున్నది. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్‌కోహ్లీ, జడేజా నిష్క్రమణతో కుర్రాళ్లతో ఉన్న జట్టు టీ20ల్లో దుమ్మురేపుతున్నది. అవకాశాలను అందిపుచ్చుకుంటూ యువ క్రికెటర్లు సత్తాచాటుతున్నారు. తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ సీనియర్ క్రికెటర్ సంజూ శాంసన్ డర్బన్‌లో మరో సూపర్ సెంచరీతో విజృంభించాడు. సఫారీ బౌలర్లను ఊచకోత కోస్తూ అలవోకగా పరుగుల వరద పారించాడు. కెప్టెన్ సూర్యకుమార్ మద్దతుతో తాను ఇలా ఆడుతున్నానంటూ చెప్పుకొచ్చిన శాంసన్..అదే జోరు కొనసాగిస్తే సఫారీలకు కష్టాలు తప్పకపోవచ్చు. శాంసన్‌కు తోడు సూర్యకుమార్, హార్దిక్‌పాండ్యా, తిలక్‌వర్మ, రింకూసింగ్ బ్యాట్లు ఝులిపిస్తే..భారత్‌కు మరోమారు భారీ స్కోరు సాధ్యమే. యువ ఓపెనర్ అభిషేక్‌శర్మ ఫామ్ ఆందోళన కల్గిస్తుండగా, ఆల్‌రౌండర్ రమణ్‌దీప్‌సింగ్ అరంగేట్రం చేసే అవకాశముంది. అర్ష్‌దీప్‌సింగ్ నిలకడగా రాణిస్తుండగా, అవేశ్‌ఖాన్ అడపాదడపా వికెట్లు తీస్తున్నాడు. వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ స్పిన్ తంత్రం పారితే మన ఖాతాలో మరో విజయం చేరినట్లే.

**గెలుపు గాడిలో పడేనా:**

దక్షిణాఫ్రికా నిలకడలేమితో ఇబ్బంది పడుతున్నది. సొంతగడ్డపై కూడా ఆ జట్టుకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రపంచకప్ తర్వాత వెస్టిండీస్‌తో సిరీస్‌ను 0-3తో కోల్పోయిన సఫారీలు..ఐర్లాండ్‌తో సిరీస్‌ను 1-1తో సమం చేసుకున్నారు. ఇప్పుడు సొంత ఇలాఖాలో టీమ్‌ఇండియాను ఎలా నిలువరిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

**జట్లు అంచనా**

**భారత్:** శాంసన్, అభిషేక్, సూర్యకుమార్(కెప్టెన్), తిలక్‌వర్మ, హార్దిక్, రింకూ సింగ్, అక్షర్‌పటేల్/రమణ్‌దీప్, అర్ష్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్, అవేశ్‌ఖాన్, వరుణ్

**దక్షిణాఫ్రికా:** రికల్టన్, మార్క్‌రమ్ (కెప్టెన్), స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, క్రుగర్, జాన్సెన్, సిమ్లెన్, కొట్జె, మహారాజ్, పీటర్/బార్ట్‌మన్

## జురెల్ మెరిసినా

**ఆసీస్ 'ఏ' చేతిలో భారత్ 'ఏ' ఓటమి**

మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి సన్నాహకంగా జరిగిన రెండు మ్యాచ్‌ల అనధికారిక టెస్టు సిరీస్‌లో భారత్ 'ఏ' క్లీన్‌స్వీప్ ఎదుర్కొంది. శనివారం ముగిసిన రెండో టెస్టులో ఆసీస్ 'ఏ' 6 వికెట్ల తేడాతో భారత్ 'ఏ'పై ఘన విజయం సాధించింది. నిర్దేశిత లక్ష్యాన్ని(168) ఆసీస్ 'ఏ' 4 వికె ట్లు కోల్పోయి ఛేదించింది. తొ లుత ఓవర్‌నైట్ స్కోరు 73/5 రెం డో ఇన్నింగ్స్‌కు దిగిన భారత్ 'ఏ' 223 పరుగులు చేసింది. ధృవ్ జురెల్(68) అర్ధసెంచరీతో కదంతొక్కాడు.



## టాప్‌లో ఆటమ్ చార్జర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్‌లో 16 జట్ల మధ్య పోరు హోరాహోరీగా సాగుతున్నది. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న టోర్నీలో శనివారం 3వ రౌండ్ ముగిసే సరికి ఆటమ్ చార్జర్స్ 532 పాయింట్లతో ఓవరాల్‌గా అగ్రస్థానంలో కొనసాగుతున్నది. టీమ్ దాసోస్(521), వ్యాలీ వారియర్స్(519) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. మూడో రౌండ్‌లో ఎమ్‌వైకె స్ట్రైకర్స్ అగ్రస్థానం దక్కించుకుంది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.